తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి  వికారాబాద్
గురువారం
19 మార్చి 2026
Follow :



# తరగతులు ఏడు.. టీచర్ ఒక్కరే!

## అటకెక్కిన చదువులు.. విద్యార్థుల భవిష్యత్తుపై ఆందోళన

- మొత్తం 62 మంది విద్యార్థులకు ఒకే గదిలో పాఠాలు
- ఒకరు ఇన్విజిలేటర్ విధులుకు.. మరొకరు సెలవులో

**బొంరాస్ పేట, మార్చి 18( జనం సాక్షి):** మండల పరిధిలోని బురాన్ పూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడు తరగతులలో మొత్తం 62 మంది విద్యార్థులు చదువు కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతము ఏడు తరగతులకు ఒకరే ఉపాధ్యాయురాలు ఉండడంతో ఏడు తరగతుల విద్యార్థులను ఒకే గదిలో కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు.పాఠశాలలో మొత్తం ముగ్గురు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తుండగా ఓ ఉపాధ్యాయుడిని పదవ తరగతి పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్గా విధులు కేటాయించారు. మరో ఉపాధ్యాయుడు సెలవుపై వెళ్లారు. దీంతో విద్యార్థుల చదువులు అటకెక్కాయి. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అధికారులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తే బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఏడు తరగతులకు ఒకరే ఉపాధ్యాయురాలు పాఠాలు బోధించడం సాధ్యం కాదు కాబట్టి ప్రత్యామ్నాయంగా పదవ తరగతి పరీక్షలు పూర్తయ్యే వరకు సీఆర్పిని లేదా మరో ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేయాలి.

**-విజయ్ కుమార్ 9వ వార్డు సభ్యుడు బురాన్ పూర్**








### పూర్తి స్థాయిలో విచారణ చేసి

# నివేదిక అందిస్తాం



- మైనర్ బాలిక మృతి పై ముబారక్ పూర్‌లో నిజ నిర్ధారణ కమిటీ పర్యటన
- సంఘటనకు సంబందించిన వివరాలు రైతు,గ్రామస్తుల ద్వారా సేకరిస్తున్నాం
- ఇంచార్జి జిల్లా బాలల పరిరక్షణ అధికారి శ్రీకాంత్,జిల్లా కార్మిక శాఖ అధికారి యాదయ్య

**నవాబ్ పేట్ మార్చి 18( జనం సాక్షి) :** నవాబ్ పేట్ మండల పరిధిలోని ముబారక్ పూర్ గ్రామంలో గత జనవరి 28న జరిగిన మైనర్ బాలిక మృతిపై జిల్లా సీడబ్ల్యూసీ అధికారులు నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది.జిల్లా సీడబ్ల్యూసీ ఆదేశాల మేరకు బుధవారం ముబారక్ పూర్ గ్రామానికి నిజ నిదరణ కమిటీని సభ్యులు చేరుకొని బాలిక మృతి సంబందించిన వివరాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ అధికారి శ్రీకాంత్,జిల్లా కార్మిక శాఖ అధికారి యాదయ్య మాట్లాడుతూ జనవరి 28న జరిగిన బాలిక (మైనర్)మృతి పై ముబారక్ పూర్ గ్రామానికి రావడం జరిగిందని చెప్పారు.రైతు దయాకర్ రెడ్డిని కూడా విచారణ చేయడం జరిగిందని ట్రాక్టర్ మాదే కానీ మా పొలంలో మాత్రం బాలిక పని చేయడం లేదని ఆయన తెలిపారని అన్నారు.ఇంకా గ్రామస్తులను కూడా పూర్తిస్థాయిలో ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుంటామని చెప్పారు.బాధిత కుటుంబ సభ్యుల గ్రామానికి చేరుకొని వారిని కూడా విచారణ చేస్తామని,మైనర్ బాలిక మృతికి సంబంధించిన అన్ని రకాల వివరాలు సేకరించి నివేదికను జిల్లా సీడబ్ల్యూసీ అధికారులకు అందజేస్తామని తెలిపారు.అధికారులు,నిజనిర్ధారణ కమిటీ సభ్యులు నామమాత్రంగా విచారణ చేయకుండా బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా విచారణ చేసి నివేదికను సంబంధిత అధికారులకు సమర్పించాలని గ్రామస్తులు కమిటీ సభ్యుల దృష్టికి తీసుకురావడం జరిగింది.ఈ నిజ నిర్దరణ కమిటీలో బాలల పరిరక్షణ జిల్లా సిఆర్పిఎఫ్ కన్వీనర్,నారే గూడెం బేగరి శివరాజ్,కవిత,రాజ్ నాయక్,అర్నిల,శ్రీనివాస్ గ్రామసర్పంచ్ జయయ్య, ఉప సర్పంచ్ వడ్ల పార్వతమ్మ రాములు,వార్డు సభ్యులు,తదితరులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

### కాగ్నా నుండి తాండూర్ పట్టణానికి

# నీటి సరఫరాకు కసరత్తు

## మున్సిపల్ చైర్పర్సన్ నీరజ బాల్ రెడ్డి



**తాండూరు మార్చి 18(జనంసాక్షి) :** తాండూర్ పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం ఉన్న నీటి సరఫరాతో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు చర్యలు వేగవంతం అవుతున్నాయి. గతంలో తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి  కాగ్నా నది నుండి పట్టణానికి త్రాగునీరు అందిస్తామని ఇచ్చిన హామీ మేరకు కసరత్తు కొనసాగుతోంది.దీనిలో భాగంగా మంగళవారం తాండూర్ మున్సిపల్ చైర్మన్ నీరజ బాల్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి మరియు కౌన్సిలర్లు కలిసి కాగ్న పంపు హౌస్‌ను సందర్శించారు. నీటి సరఫరా అమలు, సాంకేతిక అంశాలు, అవసరమైన వనరులు మరియు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు సమగ్రంగా చర్చించారు.పట్టణ ప్రజలకు తగిన మోతాదులో శుద్ధి చేసిన త్రాగునీరు అందించాలనే లక్ష్యంతో త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని నిర్ణయించారు. తాండూర్ ప్రజలకు శాశ్వత నీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా మున్సిపల్ యంత్రాంగం కట్టుదిట్టంగా ముందుకు సాగుతోందని చైర్ పర్సన్ అన్నారు.

# చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో సెమిస్టర్ ఫలితాలు విడుదల

- వైస్ ఛాన్సలర్ జీ. శంకర్ లింగం అధికారికంగా ప్రకటించారు
- ఉత్తీర్ణులను అభినందించిన ఛాన్సలర్ సీహెచ్.వీ. పురుషోత్తం రెడ్డి

**మొయినాబాద్, మార్చి 18 (జనం సాక్షి):** మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో ఉన్న చైతన్య డీమ్డ్ టూ బీ యూనివర్సిటీలో నవంబర్‌లో నిర్వహించిన సెమిస్టర్ పరీక్షల ఫలితాలను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జీ. శంకర్ లింగం అధికారికంగా విడుదల చేశారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను యూనివర్సిటీ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ సీహెచ్.వీ. పురుషోత్తం రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్. సాత్విక రెడ్డి అభినందించారు.
విభాగాల వారీగా ఉత్తీర్ణత వివరాలు ఇలా ఉన్నాయి:

**3వ సెమిస్టర్ ఫలితాలు**

డిగ్రీ (బీఏ, బీఎస్సీ, బీకామ్, బీసీ, బీబీఏ), లైట్ హెల్త్ సైన్సెస్, ఏటీటీ, ఆర్‌ఐటీ, సీవీటీ ఫిజియోథెరపీ: 516 మంది హాజరై 450 మంది ఉత్తీర్ణులు (87.20%)
బీటెక్: 856 మంది హాజరై 595 మంది ఉత్తీర్ణులు (69.50%)
బీఫార్మసీ: 121 మంది హాజరై 87 మంది ఉత్తీర్ణులు (71.90%)
నర్సింగ్: 118 మంది హాజరై 53 మంది ఉత్తీర్ణులు (44.91%)
అగ్రికల్చర్: 59 మంది హాజరై 37 మంది ఉత్తీర్ణులు (62.71%)

**5వ సెమిస్టర్ ఫలితాలు**

డిగ్రీ: 423 మంది హాజరై 295 మంది ఉత్తీర్ణులు (69.73%)
బీటెక్: 315 మంది హాజరై 242 మంది ఉత్తీర్ణులు (76.82%)
అలైడ్ హెల్త్ సైన్సెస్, ఏటీటీ, ఆర్‌ఐటీ, సీవీటీ, ఫిజియోథెరపీ: 393 మంది హాజరై 281 మంది ఉత్తీర్ణులు (71.50%)
బీఫార్మసీ: 160 మంది హాజరై 104 మంది ఉత్తీర్ణులు (65%)
అగ్రికల్చర్: 72 మంది హాజరై 55 మంది ఉత్తీర్ణులు (76.38%)
ఎంయస్సీ, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, బీఫార్మసీ: 214 మంది హాజరై 151 మంది ఉత్తీర్ణులు (70.56%)

**7వ సెమిస్టర్ ఫలితాలు**

బీటెక్: 27 మంది హాజరై 22 మంది ఉత్తీర్ణులు (81.48%)

ఈ సందర్భంగా యూనివర్సిటీ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ సీహెచ్.వీ. పురుషోత్తం రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్. సాత్విక రెడ్డి మాట్లాడుతూ అధ్యాపకుల కృషి వల్లే విద్యార్థులు ఇలాంటి మంచి ఫలితాలు సాధిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిజిస్టర్ ఏం. రవీందర్, ఎస్. కవిత, సీహెచ్. ప్రత్యూష రెడ్డి, పి. సుగందా దేవి, జీ. కుమారస్వామి, సీహెచ్. సునీత, బి. రాజేందర్ రెడ్డి తదితర అధికారులు, విభాగాధిపతులు, ఫ్యాకల్టీ సభ్యులు, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ గాదె రాంబాబు రెడ్డి, యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

# సబ్సిడీ పథకాల యాక్షన్ ప్లాన్ సవరించాలి

- ఎస్సీ ఎస్టీల సంక్షేమాభివృద్ధి రక్షణ లపై అసెంబ్లీలో చర్చించాలి
- తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ



**ముషీరాబాద్ మార్చ్ 18 (జనంసాక్షి):** ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి ఆర్థిక పథకాల కింద గత రెండు రోజుల క్రితం వాహనాల సబ్సిడీ పథకాలను ప్రకటించిన యాక్షన్ ప్లాన్ ను సవరించాలని విద్యా పరిరక్షణ కమిటీ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్, ఇంద్ర పార్క్ వద్ద ఎస్సీ ఎస్టీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎస్సీ ఎస్టీల సంక్షేమ అభివృద్ధి రక్షణ లపై అసెంబ్లీలో చర్చించాలని పేర్కొంటూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా పరిరక్షణ కమిటీ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఎస్సీ ఎస్టీ ప్రజాసంఘాల జేఏసీ సమన్వయకర్త పి శంకర్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీలకు కేటాయిస్తున్న బడ్జెట్ ను ఖర్చు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. గత రెండున్నర సంవత్సరాల కాంగ్రెస్ పాలన ఎస్సీ ఎస్టీలకు ఏ ఒక్క పథకాన్ని కూడా అమలు చేసిన పాపానికి పోలేదన్నారు. ఎస్సీ ఎస్టీల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో చేవెళ్ల డెకరేషన్ ప్రకటించి ఓట్లు కొల్లగొట్టుకుందన్నారు. ఎస్సీలకు మాత్రం ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేదన్నారు.తాము అధికారంలోకి వస్తే గత ప్రభుత్వం అమలు చేసిన దళిత బంధు స్థానంలో అంబేద్కర్ అభయస్తం ప్రారంభించి 12 లక్షల ఆర్థిక సాయం అందజేస్తామన్న హామీ నేటికి కార్యరూపం దాల్చలేదన్నారు.అదేవిధంగా పెరుగుతున్న ఎస్సీల జనాభా ప్రకారం 12 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించిందని అన్నారు. నేటికీ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని అన్నారు. గతంలో అమలు చేసిన జనరల్ స్టోర్ బ్యాంగిల్స్ స్టోర్, టెంట్ హౌస్, కారు తదితర పథకాలను ప్రకటించాలన్నారు.ఎస్సీ ఎస్టీలకు కేటాయిస్తున్న బడ్జెట్ ను కాగితాలకు మాత్రమే పరిమితం చేయకుండా వివిధ పథకాలను అమలు చేసి ఎస్సీ ఎస్టీలు సమాజంలో మహనీయులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశించినట్లు గౌరవంగా, సామాజిక భద్రతతో జీవించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డి బిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, డి బి ఎస్ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహ, కార్యదర్శి అమృత, భీమ్ మిషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు సర్వయ్య, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ నాయక్,జాతీయ మాల ఐక్యవేదిక రాష్ట్ర వైస్ చైర్మన్ ఆవుల సుధీర్, టీవీ వియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం వెంకటయ్య పాల్గొన్నారు.

## రంజాన్ కు పకడ్బందీగా ఏర్పాట్లు

**మున్సిపల్ చైర్ పర్సన్ నిరజబాల్ రెడ్డి**



**తాండూరు మార్చి 18 (జనంసాక్షి):** రాబోయే రంజాన్ పండగ సందర్భంగా మంగళవారం పట్టణ సమీపం చేన్ గేష్ పూర్ రోడ్డులో గల ఈద్గాను మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ నిరజబాల్ రెడ్డి మాట్లాడుతూ ముస్లిం సోదరులు నెలరోజుల పాటు అత్యంత పవిత్రంగా ఉపవాస దీక్షలు చేపట్టి ముగింపు సందర్భంగా రంజాన్ పర్వదినం రోజు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేస్తారని వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ముస్లిం సోదరులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. సందర్శించిన వారిలో వైస్ చైర్మన్ రజాక్ , డీఎస్పీ యాదయ్య , మున్సిపల్ కమిషనర్ మధుసుదన్ రెడ్డి , ముస్లిం మత పెద్దలు, సీఐ లు సంతోష్ , ప్రవీణ్ రెడ్డి , మున్సిపల్ కౌన్సిలర్ లు ఉన్నారు.

## బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బంటు జ్ఞానేశ్వర్

**మొయినాబాద్, మార్చ్ 18, (జనంసాక్షి):** బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మొయినాబాద్ మండలానికి చెందిన నాగిరెడ్డిగూడ గ్రామస్తుడు బంటు జ్ఞానేశ్వరను నియమించారు. ఈ మేరకు నగరంలో పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రాజభూపాల్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బంటు జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తానన్నారు. గ్రామస్థాయి నుంచి వార్డుల వారిగా ఎదుగుతూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులు కావడం సంతోషంగా ఉందన్నారు. బీజేపీ పార్టీ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై మరింత భారం పెరిగిందని పార్టీ కోసం మండల, జిల్లాస్థాయిలో పార్టీని అభివృద్ధి చేసేందుకు తనవంతు సాయశక్తుల కృషి చేస్తానన్నారు. మారుమూల గ్రామం నాగిరెడ్డిగూడ నుంచి తనను గుర్తించి జిల్లాస్థాయి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

**యాలాల సర్పంచ్ సిహెచ్ శివయ్య.**

**యాలాల మార్చి 18ఎ(జనంసాక్షి):** మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని యాలాల సర్పంచ్ సిహెచ్ శివయ్య పేర్కొన్నారు. మంగళవారం యాలాల మండల్ కేద్రంలో జామామసీదు దగ్గరా పవిత్ర రంజాన్ ఇఫ్తార్ విందు 2వ వార్డ్ నెంబర్ జిలాని ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.ఇఫ్తార్ విందు కు యాలాల గ్రామ సర్పంచ్ సిహెచ్. శివయ్య , ఉపసర్పంచ్ శోభా రాజు రెడ్డి, వికారాబాద్ జిల్లా కో -అప్షన్ అధ్యక్షులు అక్బర్ బాబ హాజరయ్యారు. ఉదయం నుండి సాయంత్రం వరకు అత్యంత పవిత్రంగా ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లిం సోదరులకు పండ్లు అందించి ఉపవాస దీక్షలను విరమింప చేశారు.ఈ సందర్భంగా యాలాల సర్పంచ్ సిహెచ్ శివయ్య మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులు నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని తెలిపారు. పవిత్ర రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు.ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కేవిపిఎస్ ప్రధాన కార్యదర్శి మల్కాయ్య,6వ వార్డ్ నెంబర్ శేఖర్,7వ వార్డ్ నెంబర్ మాలిగేరి నర్సిములు,12వ వార్డ్ నెంబర్ ఉమేష్,గ్రామ కమిటి అధ్యక్షుల రాపోల్ నాగయ్య,కార్యదర్శి హైమద్, సహాయ కార్యదర్శి గొల్ల చందు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్ నాయి,మైను,వార్ల సులేమాన్,బుర్నపూరి పాపయ్య,బుర్ణ పూరి నర్సిములు, గడ్డం వెంకటయ్య గౌడ్ ,రాములు గౌడ్, బషీర్,హన్మంతు, మౌలాన,బాగాని రాజు,బోయ హన్మంతు, ముస్లిం మత పెద్దలుమరియు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



## సేవాభావం చాటుకున్న శేఖర్ ముదిరాజ్ రహదారి మరమ్మత్తులు



**రాజేంద్రనగర్, (జనంసాక్షి):** ప్రజల సమస్యలు ఎక్కడ ఉన్నా వెంటనే స్పందిస్తూ స్వంతంగా ముందుకు వచ్చి పరిష్కారం చూపే నాయకుడిగా నిరుడు శేఖర్ ముదిరాజ్ అని గ్రామ ప్రజలు ప్రశంసిస్తున్నారు.బుధవారం కిస్మత్‌పూర్ 122 డివిజన్ పరిధిలోని దర్గా కలీజ్ ఖాన్ హిమాయత్ సాగర్ ఔటర్ రింగ్ రోడ్ అండర్‌పాస్ వద్ద రహదారి గుంతలతో దెబ్బతిని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న వెంటనే ఆయన చర్యలు చేపట్టారు. ఈ మార్గం ద్వారా ముస్లిం సోదరులు స్మశానవాటికకు వెళ్లాల్సి ఉండటంతో వర్షపు నీరు, బురద కారణంగా సమస్యలు ఎదురవుతున్నాయని స్థానికులు తెలియజేయగా, ఆలస్యం చేయకుండా నిరుడు శేఖర్ ముదిరాజ్ స్వంత ఖర్చులతో వెట్ మిక్స్ పోసి తాత్కాలికంగా రహదారి మరమ్మత్తులు చేయించారు. దీంతో ప్రజలకు తక్షణ ఉపశమనం లభించింది.ఈ సందర్భంగా స్థానిక ముస్లిం సోదరులు మాట్లాడుతూ, పదవి ఉన్నా లేకపోయినా ప్రజల కోసం పని చేసే నాయకుడు శేఖర్ ముదిరాజ్ అని ప్రశంసించారు. సమస్య చెప్పగానే స్పందించి వెంటనే పరిష్కారం చూపడం ఆయన ప్రత్యేకత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ షనవాజ్, మాజీ వార్డు మెంబర్ శాదత్ బేగ్, సాయి యాదవ్, ప్రేమ్ కుమార్, అరుణ్ గంగని పాల్గొన్నారు.

## నమో వెంకటేశాయ

**హతిరాంజీ మఠాధిపతిగా చార్జ్ తీసుకున్న శ్రీ అర్జున్ దాస్ మహంత్‌ని సన్మానించిన ప్రముఖ అడ్వకేట్ విక్రమ్ శర్మ**



**నందిగామ (జనంసాక్షి):** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ఉన్న హతిరాంజీ మఠాధిపతిగా శ్రీ అర్జున్ దాస్ జి మహంత్ బాధ్యతలు తీసుకున్న సందర్భంగా బుధవారం తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా నందిగామ మండల కేంద్రానికి చెందిన ప్రముఖ హైకోర్టు న్యాయవాది ఎం విక్రమ్ శర్మ మఠాధిపతిని సన్మానించారు. తిరుమల శ్రీవారి సన్నిధిలో పూజలు అనంతరం మఠాధిపతికి విక్రమ్ శర్మ పూలమాలవేసి శాలువాతో సన్మానించి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. ఓం నమో వెంకటేశాయ.

## మిస్క్ 'మసాలా డేట్స్'ను విడుదల చేసిన ఏపిస్




**ఖైరతాబాద్, (జనంసాక్షి) :** సుపరిచితమైన భారతీయ రుచుల కొనసాగింపుతో ఏపిస్ ఇండియా లిమిటెడ్ కు చెందిన మిస్క్ తన తాజా ఆవిష్కరణ మసాలా డేట్స్ ను హైదరాబాద్‌లో ప్రారంభించినట్లు ఏపిస్ ఇండియా ఎండీ అమిత్ ఆనంద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. ఆయన మాట్లాడుతూ ఇది సంప్రదాయం గా ప్రసిద్ధి చెందిన సూపర్ ఫుడ్-ఆన్-ది-గో కు ఒక సావరీ ట్విస్ట్ అందిస్తూ ఆచారి, ఇమ్లీ (చింతపండు ), చిల్లీ-లైమ్ అనే మూడు బలమైన భారతీయ మసాలా రుచులను గింజలు తీసిన, స్లైస్ ఖర్జూరా లతో కలిపి రూపొందించ బడిందని తెలిపారు. ఈ ప్రారంభంతో కంపెనీ తన క్లీన్-న్యూట్రిషన్, వాల్యూ-అడ్డెడ్ పోర్ట్ ఫోలియోను మరింత విస్తరించిందని తెలిపారు. ఈ తాజా ఇన్నోవేషన్ ను పరిచయం చేయడంతో రోజువారీ సౌలభ్యం, ఆరోగ్యకరమైన ఎంపికలను అందించడమే తమ లక్ష్యం అన్నారు.

## ఉప్పల్‌లో అక్రమ నిర్మాణాలపై అధికారుల నిర్లక్ష్యం... ప్రజల్లో ఆగ్రహం

**ఉప్పల్ (జనంసాక్షి):** ఉప్పల్ పరిధిలోనీ చిల్కానగర్ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు పెరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారుల నిర్లక్ష్యం తీవ్ర విమర్శలకు గురవుతోంది. నిబంధనలు పట్టించుకోకుండా ఏదేచ్ఛగా నిర్మాణాలు కొనసాగుతున్నా అధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రత్యేకంగా మూడు అంతస్తులు నిర్మించి, పైభాగంలో పెంట్ హౌస్ కూడా ఏర్పాటు చేస్తున్న నిర్మాణాలు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ అధికారులకు అవి కనిపించడంలేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.అని బిఆర్ఎస్ నాయకులు పరమేశ్వరంలో అన్నారు. ఇలాంటి నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల అక్రమాలకు మరింత ప్రోత్సాహం లభిస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. వెంటనే అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుని, నియమాలను కఠినంగా అమలు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# గ్యాస్ బుకింగ్ పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలి

### హెచ్.పీ గ్యాస్ మేనేజర్ నరేష్

**కాప్రా , మార్చి 18 (జనంసాక్షి) :** గ్యాస్ బుకింగ్ పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని శ్రీ వెంకటేశ్వర హెచ్పీ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ ఆడబాల నరేష్ పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని కుషాయిగూడ లో గల హెచ్.పీ గ్యాస్ శ్రీ వెంకటేశ్వర కార్యాలయంలో వినియోగదారులకు అవగాహన కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్యాస్ సకాలంలో రావడం లేదు అనే అపోహ వదలాలని సూచించారు. అనేకమంది వినియోగదారులు గత ఆరు నెలలగా క్యాష్ బుకింగ్ చేసుకొని కారణంగా ముఖ్యంగా వెంటనే అవడం లేదని బ్లాక్ లిస్టులోకి వెళ్ళిపోతుందని తద్వారా గ్యాస్ వెంటనే ఆన్లైన్ బుకింగ్ అవడం లేదన్నారు. ఈ విషయాన్ని ప్రతి వినియోగదారుడు గ్రహించాలని సూచించారు. కొంతమంది ఆరు నెలల నుండి సంవత్సరం పాటు ఈ కేవైసీ సైతం చేసుకోలేదన్నారు. ప్రతి వినియోగదారుడు అవసరమైన ప్రతిసారి గ్యాస్ బుకింగ్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. బుకింగ్ అనే సౌకర్యాన్ని విధిగా వాడుకోవాలన్నారు. గ్యాస్ కొరత ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. బుకింగ్ తప్పనిసరి అనే విధానం ముందు నుంచే ఉన్నప్పటికీ అట్టి విధానాన్ని కొంతమంది వినియోగించుకోలేని కారణంగా ఇప్పుడు వెంటనే బుకింగ్ కావడానికి ఒకే రోజులో 9 బుకింగ్ లో వచ్చే దానికి భిన్నంగా ప్రతిరోజు నాలుగు నుంచి ఐదువేల బుకింగ్ లో చేస్తున్న కారణంగా సకాలంలో వినియోగదారులకు గ్యాస్ సరఫరా లో కొద్ది తాత్సారం జరుగుతుందన్నారు. గతంలో ప్రతిరోజు 9 00 మాత్రమే బుకింగ్లు ఉండేవని ప్రస్తుతం మూడు నుండి నాలుగు రెట్లు పెరిగిన వినియోగదారుల బుకింగ్ కారణంగా ఈ అసౌకర్యం కలిగిందన్నారు. ఈ విషయాన్ని ప్రతి వినియోగదారుడు గుర్తించాలని కోరారు. 8888823456 ,9493602222 ఫోన్ నెంబర్ల ద్వారా ప్రతి



వినియోగదారుడు బుకింగ్ చేసుకోవాలన్నారు.బుకింగ్ చేసుకున్న వెంటనే వచ్చిన ఓటీపీని గుర్తుపెట్టుకుని ఉండాలన్నారు. వినియోగదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యం అని పేర్కొన్నారు.

## రాష్ట్ర హామీలు అమలు చేయాలని బీజేపీ నిరసన



**రాజేంద్రనగర్, (జనంసాక్షి):** రాజేంద్రనగర్ భాజాపా సర్కిల్ మండల అధ్యక్షుల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద బీజేపీ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 100 రోజులలో 6 గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి, రెండున్నర సంవత్సరాలు గడిచినా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ముఖ్యంగా యువతకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోవడం, నిరుద్యోగ భృతి ఇవ్వకపోవడం, వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పెన్షన్లు సకాలంలో అందకపోవడం, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, పేదల గృహ నిర్మాణ పథకం, రైతు భరోసా, భూ సమస్యల పరిష్కారం వంటి హామీలు నిలిచిపోయాయని తెలిపారు.ప్రభుత్వంపై నమ్మకం పెట్టుకుని ఓటు వేసిన ప్రజలు ప్రస్తుతం తీవ్ర నిరాశలో ఉన్నారని, వెంటనే అన్ని హామీలను అమలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గోల్కొండ ఇంచార్జ్ వై. శ్రీధర్, మల్లారెడ్డి, తోకల శ్రీనివాస్ రెడ్డి, బాల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లేష్ యాదవ్, కె. సదానంద్, ఎ.రాజు, ఎస్.విజయ్, మహేందర్, విట్టల్, హరికిషన్, జనార్ధన్, బాబురావు, క్రాంతి, శ్రీకాంత్ రెడ్డి, రవీందర్, డివిజన్ అధ్యక్షులు సందీప్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ విజయానికి కార్యకర్తలే బలం

### కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్ నగర్, మార్చి 18 (జనంసాక్షి):** హయత్ నగర్ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో బొమ్మిడి నాగిరెడ్డి గార్డెన్స్ లో బీజేపీ విస్తృత బూత్ స్థాయి కార్యకర్తల సమావేశానికి హయత్ నగర్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఈ నెల 20, 21, 22 తేదీ లలో మంగళపల్లిలోని కేఎంఐటీ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించనున్న పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ శిక్షణా తరగతుల గురించి కార్యకర్తలకు వివరించారు. ప్రతి బూత్ నుండి కనీసం ఇద్దరు సభ్యులు తప్పనిసరిగా పాల్గొనాలని, ఈ శిక్షణ ద్వారా పార్టీ సిద్ధాంతాలు, సంస్థాగత బలం, ప్రజలతో అనుసంధానం మరింత బలపడుతుందని తెలిపారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రతి కార్యకర్త బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ విజయానికి కార్యకర్తలే బలమని, అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళ్లెం రవీందర్ రెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, హయత్ నగర్ ప్రభారీ కొత్త రవీందర్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉగాది ఎల్లప్ప, డివిజన్ కార్యదర్శి గోవింద చారి, సీనియర్ నాయకులు సంఘీ అశోక్, జంజ్య నాయక్, మహిళా నాయకులు పార్వతి, మహిళా అధ్యక్షురాలు గీత, సుజాత, మోర్చాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## 6 గ్యారంటీలు ప్రచార హామీలుగానే మిగిలి పోయాయి

### మాజీ కార్పొరేటర్లు



**హయత్ నగర్, మార్చి 18 (జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు వానిపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో హయత్ నగర్, బి.ఎన్. రెడ్డి డివిజన్‌ల తాజా మాజీ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డిలు కలిసి జోనల్ కమీషనర్ కార్యాలయం వద్ద భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని వారు తీవ్రంగా విమర్శించారు. ముఖ్యంగా పెన్షన్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన, ఎంతో ప్రచారం చేసిన 6 గ్యారంటీల అమలులో స్పష్టత లేకపోవడం ప్రజలను మోసం చేయడమేనని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెన్షన్ లబ్ధిదారులు నెలల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, పేదల కోసం నిర్మించాల్సిన డబుల్ బెడ్‌రూమ్ ఇళు ఆలస్యం అవుతున్నాయని వారు తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం విఫలమైందని, 6 గ్యారంటీలు కేవలం ప్రచార హామీలుగానే మిగిలిపోయాయని వారు అన్నారు. హయత్ నగర్ పరిధిలో రోడ్ల దుస్థితి, డ్రైనేజీ సమస్యలు, ప్రాథమిక సదుపాయాల లోపం వంటి సమస్యలు రోజు రోజుకూ పెరుగుతున్నాయని వారు పేర్కొన్నారు. ఈ సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జోనల్ కమీషనర్‌కు వినతి పత్రం అందచేశారు. ప్రభుత్వం స్పందించకపోతే బీజేపీ తరపున మరింత ఉద్ధృతంగా ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, బీజేపీ హయత్ నగర్, వనస్థలిపురం, బి . యన్ రెడ్డి, మన్సూరాబాద్, డివిజనన్‌ల అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, కటకం క్రాంతి, నాయకులు, కార్యకర్తలు, మోర్చాలా నాయకులు, పాల్గొన్నారు.



## మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

- ఏఎస్ రావు నగర్ మహిళా మండలి ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు
- ముఖ్య అతిథిగా హాజరైన మాజీ కార్పొరేటర్




**కాప్రా, (జనంసాక్షి) :** కాప్రా సర్కిల్ డాక్టర్ ఏఎస్ రావు నగర్ మహిళా మండలి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజం సుస్థిరంగా అభివృద్ధి చెందాలంటే మహిళా సాధికారత ఎంతో అవసరమన్నారు. విద్య, ఉపాధి, రాజకీయాలు, సామాజిక సేవ వంటి అన్ని రంగాల్లో మహిళలు తమ ప్రతిభను చాటుతూ సమాజానికి దిశానిర్దేశం చేస్తున్నారని కొనియాడారు. మహిళల హక్కుల పరిరక్షణతో పాటు వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు ఇలాంటి వేడుకలు దోహదపడతాయని పేర్కొన్నారు. మహిళలంతా ఐక్యంగా ఉండి తమ సామర్థ్యాన్ని నిరూపించు కోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు డి. విజయ, ఉపాధ్యక్షురాలు పి. సువర్ణ, కార్యదర్శి రంజనా మలాకర్, సంయుక్త కార్యదర్శి వై.డి. నిర్మల, కోశాధికారి పి. నాగలక్ష్మి, సభ్యులు కమల, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలు పరిష్కరించడమే ప్రత్యేక కర్తవ్యం

### 31వార్డు కౌన్సిలర్ అవుసుల యోగానంద్ చారి

**తాండూరు మార్చి 18 (జనంసాక్షి) :** ప్రజల సమస్యలు పరిష్కరించడమే ప్రత్యేక కర్తవ్యమని31వార్డు కౌన్సిలర్ అవుసుల యోగానంద్ చారి పేర్కొన్నారు.గత ఐదు రోజులుగా మంచినీరు రాకపోవడంతో ప్రజలు నీటి కోసం ఇబ్బంది పడుతు న్నారని వార్డు కౌన్సిలర్ వెంటనే స్పందించారు. వాటర్ ట్యాంకర్ల ను ఏర్పాటు చేసి



తాగునీటి సమస్యను పరిష్కరించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ 31వార్డు కౌన్సిలర్ అవుసుల యోగానంద్ చారి మాట్లాడుతూ వేసవి కాలనీ దృష్టిలో పెట్టుకొని వార్డుప్రజలకు నీటి కష్టాలు తొలగింప చేయడం జరిగిందని తెలిపారు. పదవి అంటే అనుభవించటానికి కాదని ప్రజా సేవ చేయడమే ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. వార్డు ప్రజల సమస్యలు పరిష్కరించడంలోని సంతృప్తి లభిస్తుందని వెల్లడించారు. వార్డులో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు.వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.



అమావాస్య సందర్భంగా ఉప్పల్ బగాయత్‌లోని కాల భైరవ స్వామి దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

# క్రీడలు శారీరక మానసిక బలానికి దోహదపడతాయి

## యువతలో స్నేహ భావం పెరుగుతుంది లచ్చునాయక్ తాండ సర్పంచ్ చౌహన్ లక్ష్మీ రాజు



**మోమిన్ పేట మార్చి 18 (జనంసాక్షి):** క్రీడలు మానసిక శారీరక బలాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని లచ్చ నాయక్ తాండ గ్రామ సర్పంచ్ లక్ష్మి చౌహన్ రాజు అన్నారు. బుధవారం మోమినిపేట మండల పరిధిలోని లచ్చ నాయక్ తండాలో జై సేవాలాల్ గ్రామస్థాయి వాలీ బాల్ టోర్నమెంటును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు గ్రామస్థాయిలో టోర్నమెంట్లు నిర్వహించడం వల్ల క్రీడాకారులుగా గుర్తించ బడతారన్నారు. అలాగే మారుమూల గ్రామాల్లో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం వల్ల యువతలో స్నేహభావము పెరుగుతుందన్నారు .తద్వారా ఆయా క్రీడల్లో నైపుణ్యత సాధించిన యువత ఆయా క్రీడల్లో రాణించగలుగుతారన్నారు. క్రీడా పోటీల్లో గెలుపు ఓటములు సహజమేనని గెలిచినవారు పొంగిపోకుండా, ఓడిన వారు కృంగిపోకుండా, సహనం పాటించి మళ్లీ గెలిచేందుకు కృషి చేయాలన్నారు. క్రీడా పోటీల్లో 20 టీములు పాల్గొన్నాయని అందులో మొదటి బహుమతి 10000, వేలు, రెండవ బహుమతి 6000 వేలుగా నిర్ణయించామని, బహుమతుల ప్రధాత చౌహన్ జగదీష్, ఆర్గనైజర్లు మహేందర్, రాజు, ఉప సర్పంచ్ మెగావత్ లక్ష్మి, చరణ్ సింగ్, వార్డు మెంబర్లు, ఆయా గ్రామాల క్రీడాకారులు గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

# మున్సిపల్ అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములుగా చేస్తూ అభివృద్ధికి కృషి చేయాలి

## చైర్మన్ దేవర సమతా వెంకట్ రెడ్డి




**చేవెళ్ల, (జనంసాక్షి):** మున్సిపల్ అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములుగా చేస్తూ అభివృద్ధికి కృషి చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతవెంకట్ రెడ్డి అన్నారు. 99రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో మున్సిపల్ కమిషన్ వెంకటేశం, వార్డు కౌన్సిలర్ పైండ్ల మధుసూదన్ రెడ్డిలతో చైర్ పర్సన్ పర్యటించి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ సిబ్బందితో రోడ్లన్ని శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లు ప్రజలకు సమయం కేటాయించి వారి సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. మున్సిపల్ అభివృద్ధిలో ప్రజలను భాగ స్వాములను చేస్తూ అభివృద్ధికి కృషి చేయాలని అని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ప్రజలకు అందేలా చూడాల్సిన బాధ్యత కౌన్సిలర్లపై ఉంటుందన్నారు. వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బండారి శైలజా ఆగి రెడ్డి, మద్దెల శ్రీనివాస్, కృష్ణానాయక్, సీనియర్ నాయకులు బాల్వంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేష్, రవీందర్ గౌడ్, నాయకులు స్వామి గౌడ్, జగన్ గౌడ్, శివకుమార్ గౌడ్, కలీమ్, ఖదీర్, లియాకత్ తదితరులు ఉన్నారు.

# ఇరాన్‌పై యుద్ధాన్ని వెంటనే నిలిపివేయాలి

## జవహర్‌నగర్‌లో రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్




**జవహర్‌నగర్, (జనంసాక్షి):** ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దేశాలు కొనసాగిస్తున్న దాడులను తక్షణమే నిలిపివేయాలని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జవహర్‌నగర్ జీహెచ్‌ఎంసీ పరిధిలోని చెన్నాపూర్, దేవేందర్‌నగర్‌లో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కమిటీ అధ్యక్షుడు మహ్మద్ పాషామియా అధ్యక్షత వహించారు. పశ్చిమాసియా దేశాల్లో నెలకొన్న యుద్ధ పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసిన పలువురు నేతలు, ఇరాన్‌పై సాగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. అమెరికా ఆధిపత్య ధోరణిలో భాగంగానే ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్, వెనుజులా వంటి దేశాలపై దాడులు జరుగుతున్నాయని సీపీఎం నాయకుడు శివన్నారాయణ విమర్శించారు. ప్రపంచ శాంతి కోసం భారత ప్రభుత్వం చొరవ చూపాలని, ముఖ్యంగా ప్రధాని నరేంద్రమోదీ అంతర్జాతీయ వేదికలపై యుద్ధ విరమణకు కృషి చేయాలని ఐఎఫ్టీయూ నాయకులు షేక్ షావలి, శివబాబు డిమాండ్ చేశారు. అమెరికా విదేశాంగ విధానాల కారణంగా అనేక దేశాల్లో అంతర్యుద్ధాలు సృష్టించి, అక్కడి వనరులను దోచుకుంటున్నదని పలువురు విమర్శించారు. ఇరాన్‌పై విధించిన ఆంక్షల వల్ల అక్కడి ప్రజలు ఆహారం, వైద్యం, ఉపాధి వంటి మౌలిక అవసరాల కోసం ఇబ్బందులు పడుతున్నారని పీడీఎం నేత చంద్రమౌళి తెలిపారు. అమెరికా, నాటో దేశాల జోక్యంతో ఆఫ్ఘానిస్తాన్, ఇరాక్, లిబియా, సిరియా వంటి దేశాలు అస్థిరతకు గురయ్యాయని, ప్రస్తుతం ఇరాన్‌పై కూడా అదే విధానాన్ని కొనసాగిస్తున్నారని ముస్లిం కమిటీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధాల వల్ల సాధారణ ప్రజలే ఎక్కువగా నష్టపోతున్నారని, ప్రపంచ దేశాలు మానవత్వ దృక్పథంతో స్పందించాలని కోరారు. ఇలాంటి పరిస్థితుల్లో భారత ప్రభుత్వం అలీన విధానాన్ని అనుసరిస్తూ యుద్ధ నివారణకు కృషి చేయాలని సమావేశంలో తీర్మానించారు. యుద్ధ ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం మరింత పెరిగే ప్రమాదం ఉందని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఇతర ప్రజా సంఘాల నాయకులు కొలిపాక సాయికిరణ్, మహ్మద్ మథీన్, పాల్గొన్నారు.

# సోదర భావానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులు



## మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్ మార్చి 18 (జనంసాక్షి)** సోదర భావానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులు దోహదపడతాయని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహమ్మద్ షాకీర్ ఆధ్వర్యంలో గాంధీనగర్ లోని స్కైటన్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందు కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ ఇఫ్తార్ అనేది కేవలం ఉపవాస విరమణ మాత్రమే కాదనీ, మతసా మరస్యానికి ప్రతీక అని అన్నారు. సమాజం లో అందరూ కలిసి మెలిసి ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి ఉందని మైనార్టీ వర్గాలకు అనేక రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని పేర్కొన్నారు. నియోజకవర్గ మైనార్టీ సోదరులందరికీ ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ ఖాజామియా, రమేష్ మంజల్కర్, మల్లం శ్రీనివాస్ గౌడ్,మోటే శ్రీనివాస్ యాదవ్,ఏర్వ వెంకట్,తోకల శ్రీను, మహమ్మద్ ఖాన్, మొయినుద్దీన్, సంజు, చోటు మొహమ్మద్ జహంగీర్,యాసిడ్ శీను,ముస్లిం మత పెద్దలు, పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలు ఇచ్చారు



- అమలు చేయటం మరిచారు
- తాజా మాజీ కార్పొరేటర్లు

**హయత్ నగర్, (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తవుతున్నా, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ఇప్పటికీ పూర్తి స్థాయిలో అమలు కాలేదని ఆరోపిస్తూ హయత్ నగర్, మన్సూరాబాద్ డివిజన్‌ల తాజా మాజీ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, కొప్పుల నర్సింహా రెడ్డిలు ఆర్‌డిఓ అనంత రెడ్డి, ఎమ్మార్వో జానకిలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భం గా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలు విషయంలో స్పష్టత లేకపోవడం వల్ల ప్రజల్లో ఆగ్రహం పెరుగుతోందని అన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు ప్రభుత్వం మీద ఆశలు పెట్టుకుని ఎదురుచూస్తున్నాయని, కానీ ఇప్పటికీ వారికి సరైన లబ్ధి అందకపోవడం బాధాకరమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలు ఇచ్చారు, కాని వాటిని అమలు చేయటం లో మరిచారని ఎద్దేవా చేశారు. హయత్ నగర్, వివిధ ప్రాంతాల్లో అర్ధాంతరంగా నిలిచిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులను వెంటనే పునఃప్రారంభించి, అర్హులైన నిరుపేదలకు త్వరితగతిన అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంటనే ఆరు గ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని, లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, హయత్ నగర్, మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, హరీష్, సీనియర్ నాయకులు జంజ్య నాయక్, ఇట్టబోయిన నర్సింహా, జంగా రెడ్డి, నక్క రాజేష్, మొగులయ్య, కొండల్ రెడ్డి, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# చలో అసెంబ్లీ 26కి వాయిదా

## టిఎస్ యుటిఎఫ్

**ముషీరాబాద్, మార్చి 18 (జనంసాక్షి):** కెజిబివి, యుఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలపై టిఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించ తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని మార్చి 26 కు వాయిదా వేస్తున్నట్లు టీఎస్ యుటిఎఫ్ ఒక ప్రకటన విడుదల చేసింది. శుక్రవారం రంజాన్ పండుగ నేపథ్యంలో చలో అసెంబ్లీ ని వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ మార్పును గమనించాలని సంబంధిత ఉపాధ్యాయులకు టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు.



# కమ్మ సామాజిక వర్గాన్ని విమర్శించిన విశారదన్ పై చర్యలు చేపట్టండి



శేరిలింగంపల్లి, (జనంసాక్షి) : సంబంధం లేని విషయాలను తమకు ఆపాదిస్తూ కమ్మ సామాజిక వర్గాన్ని దారుణంగా కించపరిచే విధంగా మాట్లాడిన విశారదన్ అనే వ్యక్తిపై తక్షణమే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించి ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా బుధవారం శేరిలింగంపల్లిలో ఏర్పాటుచేసిన సమావేశంలో కమ్మ సేవా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు దినేష్ చౌదరి మాట్లాడుతూ తమ సామాజిక వర్గానికి, ఖమ్మంలోని వెలుగు మట్ల గ్రామంలోని పేదల ఇళ్ల కూల్చివేతకు సంబంధాన్ని అంటగడుతూ అనవసరంగా తమ సామాజికవర్గాన్ని కించపరిచే విధంగా, కమ్మ కులస్థులను దుర్మార్గులుగా చిత్రించే విధంగా మాట్లాడిన విశారదన్ అనే వ్యక్తిపై తప్పకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగం అందజేసిన వాక్ స్వాతంత్ర్యాన్ని ఇలా ఒక సామాజిక వర్గం మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉపయోగించడం అన్యాయమన్నారు. ఇందులో భాగంగానే తమ సామాజిక వర్గం ప్రజల అభీష్టంమేరకు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లో విశారదన్ పై ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూదాన్ భూమి పరిధిలోని పేదల ఇళ్లు కూల్చివేసింది రాష్ట్ర ప్రభుత్వమైతే విశారదన్ వాస్తవాలను తప్పుదోవ పట్టిస్తూ కమ్మ సామాజిక వర్గాన్ని తీవ్రంగా విమర్శిస్తూ తన అక్కస్సును వెళ్లగక్కడం ఉద్దేశపూర్వక చర్యగా ఆయన అభివర్ణించారు. ఆయన దృష్టిలో వెలుగుమట్ల కూల్చివేతల ఏదైనా కమ్మ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఉంటే నేరుగా అతని పేరును ఉపయోగిస్తూ మాట్లాడాల్సిన అవసరం ఉన్నదని, ప్రభుత్వంపై విమర్శలు ఎక్కు పెట్టాల్సింది పోయి తమ సామాజిక వర్గాన్ని తూలనాడడం విశారదన్ దుందుడుకు చర్యలకు నిదర్శనంగా తాము భావిస్తున్నామన్నారు. అయితే వెలుగుమట్ల బాధితులు కూల్చివేతలతో సర్వం కోల్పోయి రోడ్డు మీద పడినప్పుడు వారికి కమ్మ సామాజిక వర్గానికి చెందిన పువ్వాడ అజయ్ అనే నాయకుడు భోజనాల అందించి మానవత్వాన్ని చాటుకున్న విషయాన్ని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మల్లిఖార్జున నాయుడు, పృథ్వీ, మొవ్వ కిషోర్, సురేష్, ఉన్నం శ్రీధర్ పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో ఆర్ఐ

- 15 వేల లంచం తీసుకుంటుండగా పట్టివేత
- ఆర్ఎస్ఆర్ సమస్యతో లంచం డిమాండ్



వికారాబాద్ జిల్లా బ్యూరో మార్చి 18 (జనంసాక్షి): ఏ శాఖలో చూసిన ఏమున్నది గర్వ కారణం అంతా అవినీతి తప్ప.. అన్నట్లు చిన్న జిల్లా అయినప్పటికీ ప్రతి శాఖలో భారీగా అవినీతి జరుగుతుంది. అందుకు ఉదాహరణగా జిల్లాలో వరసగా ఏసీబీ దాడులు జరుగుతున్నాయి. తాజాగా వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండల తహసిల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడి జరిగింది. ఇక్కడ పనిచేస్తున్న రెవెన్యూ ఇన్స్పెక్టర్ రిచార్డ్ సైమాన్ 15 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఇందూరు గ్రామానికి చెందిన విట్టల్ యాదవ్ దగ్గర 2017లో సర్వే నబర్ 104 లో ఉన్న మూడు ఎకరాల భూమిని రాజీవ్ యాదవ్ జిపిఏ చేసుకున్నారు. దానిని రాజుధర్ రెడ్డి కొనుగోలు చేశాడు. ఇట్టి భూమి మోటేషన్ చేయడానికి ఇచ్చే రిపోర్టు కోసం స్థానిక రెవెన్యూ ఇన్స్పెక్టర్ రిచార్డ్ సైమాన్ 25 వేల లంచం డిమాండ్ చేశాడు. 15 వేల లంచం ఇస్తానని భూమి కొనుగోలుదారుడు ఆర్ ఐ తో అంగీకారానికి వచ్చాడు. ఇదే విషయమై భూమి కొనుగోలుదారుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో గుడిమల్కాపూర్ దగ్గర ఉన్న ఒక హోటల్లో ఆర్ ఐ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. అనంతరం మండల తాసిల్దార్ కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. ఆర్ఐ నుంచి మోటేషన్ కు సంబంధించిన ఫైళ్లను ఏసీబీ అధికారు లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు ఆర్ ఐ రిచార్డ్ సైమాన్ ను ఏసీబీ కోర్టులో హాజరు పరిచినట్లు తెలుస్తోంది.

# 2బిహెచ్‌కే కాలనీల వాణిజ్య సముదాయాల వేలం నిలిపివేయాలి

## ప్రభుత్వ నిర్ణయాన్ని సిపిఎం జిల్లా కమిటీ ఖండన

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 18 (జనంసాక్షి): మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లాలోని 2బిహెచ్‌కే కాలనీలలో ఉన్న వాణిజ్య సముదాయాలను వేలం పద్ధతిలో విక్రయించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సిపిఎం మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కమిటీ బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేసింది. జిల్లాలోని 16 2బిహెచ్‌కే కాలనీలలో ఉన్న 992 వాణిజ్య సముదాయాలను వేలం ద్వారా విక్రయించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు ప్రకటించడం సరైంది కాదని సిపిఎం జిల్లా కార్యదర్శి పి. సత్యం పేర్కొన్నారు. వేలం ద్వారా వచ్చిన డబ్బును కాలనీల అభివృద్ధి పనులకు వినియోగిస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, కాలనీలలోని లిఫ్టులు మరియు ఇతర నిర్వహణ ఖర్చులను ఎవరు భరించాలనే ప్రశ్న తలెత్తుతుందని ఆయన అన్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన 2బిహెచ్‌కే కాలనీల నిర్వహణ కోసం ప్రజలపై అదనపు భారం పడకుండా ఉండేందుకు వాణిజ్య సముదాయాలను కూడా నిర్మించారని తెలిపారు. ఆ సముదాయాల ద్వారా వచ్చే ఆదాయాన్ని లిఫ్టులు ఇతర నిర్వహణ ఖర్చులకు వినియోగించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఇప్పుడు వాటిని వేలం వేస్తే కాలనీల నిర్వహణ ఖర్చులు ప్రజలపై భారం అవుతాయని సిపిఎం పేర్కొంది.



అందువల్ల వెంటనే వాణిజ్య సముదాయాల వేలాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేసింది. అలాగే 2బిహెచ్‌కే కాలనీలలో అసంపూర్తంగా ఉన్న పనులను పూర్తి చేయడంతో పాటు మరమ్మత్తు పనుల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సిపిఎం కోరింది. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సిపిఎం హెచ్చరించింది.

# ఘనంగా మాస శివరాత్రి పూజలు



శామీర్ పేట, మార్చి 18 (జనంసాక్షి) : ఘనంగా మాస శివరాత్రి పూజలను నిర్వ హించారు. మండల కేంద్రం శామీర్ పేట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో (శివాలయం) ఆలయ ప్రధాన అర్చకులు గడియారం మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి రుద్రాభిషేకం, అర్చన, హారతి, మంత్రపుష్పం నిర్వహించారు. శామీర్ పేట కు చెందిన శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి భజన మండలి, అలాగే తూంకుంట, ఉప్పర్ పల్లి లకు చెందిన భజన మండలి సభ్యులు భక్తి గీతాలు ఆలపించారు. భక్తుల సహకారంతో అన్నదానం చేపట్టగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. అలాగే ఉమ్మడి శామీర్ పేట మండలంలోని వివిధ గ్రామాలలోని శివాలయాలలో మాసశివరాత్రి పూజలను నిర్వహించారు.

# ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

## తాసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేత




యాచారం, మార్చి 18(జనంసాక్షి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా నెరవేర్చలేదని యాచారం మండల కేంద్రం లో బీజెపి మండల అధ్యక్షులు జరుపుల విజయ్ నాయక్ ఆధ్వర్యంలో మండల తాసిల్దార్ కార్యాలయ అధికారి కి వినతిపత్రం అందజేశారు. ముఖ్య అతిధిగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి కొప్పు బాషా , రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి మర్రిపల్లి అంజయ్య యాదవ్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలైన రైతు భరోసా, పింఛన్లు, నిరుద్యోగ భృతి, దళిత బంధు, కళ్యాణ లక్ష్మి, మహిళలకు భరోసా, డబల్ బెడరూం ఇండ్లు తదితర హామీలు ఇచ్చి ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని చేతగాక పోతే వెంటనే గద్దె దిగాలని అన్నారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ లు విజయ్ కుమార్, ఆంబోజి రమేష్, బీజేపీ జిల్లా కార్యదర్శి కొండా మధుకర్ రెడ్డి, సీనియర్ నాయకులు నాగిని యాదయ్య, ఆంబోజి జగదీశ్ యాదవ్,గోగికర్ రమేష్,దెరంగుల రాజు, బాలరాజు, తాండ్ర రవీందర్, కొండాపురం నాగరాజు, దయాకర్, శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మండల ప్రజలకు

# ఉగాది శుభాకాంక్షలు

సీనియర్ నాయకులు వెంకటేష్ చారి

ధారూర్ (జనంసాక్షి): ఈ కొత్త సంవత్సరం మండల ప్రజలకు అందరికీ ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం, తీసుకురావాలని ప్రతి ఇంట్లో సుఖ శాంతులు నిండాలని ,ప్రతి కుటుంబం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఈ ఉగాది మీ జీవితాల్లో కొత్త ఆశలు.కొత్త విజయాలు తీసుకురావాలని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన సీనియర్ నాయకులు వెంకటేశం చారి.

# మజీద్ కమిటీ అధ్యక్షులు గౌస్ బాబా ఇఫ్తార్ విందులో నాయకులు



శామీర్ పేట్, మార్చి 18 (జనంసాక్షి): తుంకుంట మజీద్ కమిటీ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ గౌస్ బాబా ఆధ్వర్యంలో మొగుళ్ళ వెంకట్ రెడ్డి ఫంక్షన్ హాలులో నాయకులు,రిపోర్టలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. జిహెచ్ఎంసి పరిధి తూంకుంటలో బుధవారం ఇఫ్తార్ విందు ఇచ్చి ఉమ్మడి శామీర్ పేట్ మండల రిపోర్టర్లను సన్మానించారు. పలువురు ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్ధనలు చేసి ఒక్కపొద్దులు విడిచారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బీమిడి జైపాల్ రెడ్డి, తూంకుంట మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మధుసూదన్ రెడ్డి, రవీందర్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముస్లిం సోదరులు, ఉమ్మడి శామీర్ పేట్ మండల రిపోర్టర్లు పాల్గొన్నారు.

## మియాపూర్ సర్కిల్ పరిధిలో సానిటేషన్ పై ప్రత్యేక దృష్టి



**శేరిలింగంపల్లి, మార్చి 18 (జనంసాక్షి) :** మియాపూర్ సర్కిల్ పరిధిలో సానిటేషన్ పై ప్రత్యేక దృష్టికి సాధించడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న 99 రోజుల ప్రత్యేక ప్రణాళికా కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా అమలు చేయడానికి నిర్దిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని సర్కిల్ ఉప కమిషనర్ శశిరేఖ మీడియాకు వివరించారు. ఈ మేరకు సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సర్కిల్ కార్యాలయంలో శానిటేషన్ వింగ్ కు సంబంధించి వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసి పలు అంశాలపై చర్చించడం జరిగిందని అన్నారు. మియాపూర్ సర్కిల్ పరిధిలోని ప్రతి కాలనీ, బస్తీ పరిధిలోని పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టిని సారించి ఎక్కడ అపరిశుభ్రతకు తావియ్యని విధంగా శానిటేషన్ సిబ్బందితో వివిధ రూపాలలో పనులను చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగానే బహిరంగ ప్రదేశాలలో చెత్తాచెదారానికి తావు లేకుండా గార్బేజ్ వల్నర్ పాయింట్స్(జివిపి) ని దశలవారీగా నిర్మూలించడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. రోడ్లపై నిర్లక్ష్యంగా చెత్త వేసే వారి విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నామని, నగదు జరిమానా, వారి వ్యవహార శైలిని బట్టి అవసరమైతే చట్టప్రకారం చర్యలకు కూడా కొనుక్కోవడం జరుగుతుందని, ప్రజలంతా దీనిని దృష్టిలో ఉంచుకొని పరిసరాల పరిశుభ్రతకు, ఇంటింటి చెత్త సేకరణకు పూర్తిగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమీక్ష సమావేశంలో రెవెన్యూ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు, ఎస్.డబ్ల్యూ.ఎం డిప్యూటీ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్, ఆర్పీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ మంత్రి తుళ్ల దేవేందర్ గౌడ్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన తెలుగుదేశం నాయకులు



**కాప్రా (జనంసాక్షి):** ఉమ్మడి రాష్ట్రం బి సి,రెవెన్యూ, సినిమాటోగ్రఫీ శాఖ హోమ్ శాఖ మాజీ మంత్రి తూళ్ల దేవేందర్ గౌడ్ పుట్టిన రోజు సందర్భంగా తుక్కుగూడ లోని నివాసానికి వెళ్లి దేవేంద్ర గౌడ్ ను శాలువాతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం లో తెలంగాణ తెలుగు దేశం పార్టీ మల్కాజిగిరి మేడ్చల్ జిల్లా కన్వీనర్ కందికంటి అశోక్ కుమార్ గౌడ్ తెలంగాణ తెలుగు దేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరు కొండ సతీష్ బాబు మాజీ కౌన్సిలర్ గద్దమీధి రాములు యాదవ్ టి యన్ ఎస్ ఎఫ్ రాష్ట్ర మాజీ జనరల్ సెక్రటరీ శివానంద్ సీనియర్ నేతలు గొట్టిపాటి వెంకటేశ్వరావు, డా ఏ ఎస్ రావు నగర్ డివిజన్ బి జె ఆర్ కాలనీ అధ్యక్షుడు ఎస్ ఏ రహీమ్, ఉప్పల్ డివిజన్ అధ్యక్షుడు టిక్కా ప్రకాష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏరియల్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులు

**ఏరియల్ రోడ్డు సర్వే కొనసాగుతుంది.**



**జిల్లేడు చౌదరి గూడ (జనంసాక్షి):** జిల్లేడు చౌదరి గూడా మండల పరిధిలో లచ్చంపేట, తుమ్మలపల్లి రెవెన్యూ భూముల మీదుగా ఏరియల్ రోడ్డు వెళ్లడంతో రైతులు భూములు కోల్పోవడం వలన ఆందోళన చెందుతున్నారు గురువారం నాడు ఆర్డీవో సరిత, తాసిల్దార్ జగదీశ్వర్, గ్రామాలకు వెళ్లి గ్రామసభ నిర్వహించారు రైతులు ఎవరు కూడా ఆందోళన చెందకుండా ఉండాలని సూచించారు ప్రభుత్వపరంగా రైతులకు తగు సహాయం అందుతుందని భరోసా కల్పించారు ఒక్కొక్క రైతు వి ఎంత భూమి రోడ్డులో పోతుంది అనేది చెప్పలేం అందులో భూమి పోయినా రైతుకు సహాయం అందుతుందని భరోసా కల్పించారు.

## శేరిలింగంపల్లిలో సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన అరికెపూడి



**శేరిలింగంపల్లి, (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలువురు సిఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు బుధవారం పిఏసి చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి హైదర్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇందులో భాగంగా 64 మంది లబ్ధిదారులకు 35.29 లక్షల రూపాయల విలువైన చెక్కులను అరికపూడి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజక వర్గం పరిధిలోని నిరుపేద వర్గాలకుచెందిన పలువురు లబ్ధిదారులు తమ వైద్యచికిత్స నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవడం జరిగిందని, ఈ క్రమంలో వారందరికీ అర్హత మేరకు 35 లక్షల 29 వేల రూపాయల విలువచేసే సిఎంఆర్ఎఫ్ మంజూరి పత్రాలను అందజేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్పవరం అని, ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు సాగుతుందన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, వివిధ కారణాల రీత్యా అనారోగ్యం పాలైన బాధితులు ఆర్థిక స్థోమత లేక ఖరీదైన వైద్యానికి దూరంగా ఉంటున్న సందర్భాలను పరిగణలోకి తీసుకొని భరోసాన్ని కల్పిస్తుందన్నారు. ఆపన్న హస్తం అందిస్తుందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఆసుపత్రిలో బిల్లులు కట్టలేని పరిస్థితిలో ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ ఆర్థిక సాయాన్ని అందిస్తుందని, దీనిలో భాగంగానే నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు కొన్ని వేల కుటుంబాలకు సిఎంఆర్ఎఫ్ నిధులను అందించి ఆదుకోవడం ద్వారా వారి జీవితాలలో వెలుగును నింపింది అన్నారు. గతంలో ఉన్న బిల్లులకు అనుగుణంగానే ప్రస్తుతం ఆర్థిక సాయం అందించడం జరుగుతుందని, దానిని మరింత పెంచేలా కృషి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని త్వరలోనే కలిసి వినతి పత్రాన్ని అందజేయడంతోపాటు సిఎంఆర్ఎఫ్ నిధులను మరింత పెంచాల్సిన అవసరం ఉందని కోరడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రామంతపూర్‌లో బీజేపీ వినతిపత్రం సమర్పణ

### ఆరు గ్యారెంటీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు



**హైదరాబాద్, (జనంసాక్షి):** బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు రామంతపూర్ డివిజన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయలేదని ఆరోపిస్తూ మంగళవారం స్థానిక నాయకులు వినతిపత్రం సమర్పించారు. రామంతపూర్ డివిజన్ అధ్యక్షుడు వంగాల సంతోష్ గుప్తా నాయకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేర్చలేదని నాయకులు విమర్శించారు. ముఖ్యంగా కొత్త రేషన్ కార్డుల జారీ, వృద్ధులకు పింఛన్లు, మహిళలకు రూ.4,000 ఆర్థిక సహాయం, నిరుద్యోగులకు నెలకు రూ.2,500 భృతి వంటి అంశాలు అమలు కాలేదని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్మెంట్ అనంతరం పొందాల్సిన పెన్షన్ మరియు ఇతర రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు జిహెచ్ఎంసి ఉప్పల్ కమిషనర్‌కు, అలాగే ఉప్పల్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం తక్షణమే ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తాళ్ల బాలకృష్ణ గౌడ్, వల్లభు జగన్ యాదవ్, వేముల తిరుపతయ్య, ఉపేందర్ యాదవ్, పెంటం శైలేందర్, తంబలి రవి, సురేష్ శర్మ, బైగండ్ల భరత్, సురేష్ కుమార్, మహిళా నాయకురాళ్లు అంబటి భాగ్యలక్ష్మి, సంగీత, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

### బాయ్ బాయ్ జబర్దస్త్ హాయే



**జిల్లేడు చౌదరి గూడా (జనంసాక్షి):** మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చలివేంద్ర పల్లి రాజు ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు జామియా మసీదు చౌదరిగుడా లో హిందూ ముస్లింలు సోదర భావంతో ఇఫ్తార్ విందు జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో చౌదరి గూడ సర్పంచ్ చంద్రబాబు, ఉప సర్పంచ్ అజు, వార్డ్ నంబర్లు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

### నక్కలపల్లి గ్రామ మాజీ సర్పంచ్ స్వప్న అంజయ్య గౌడ్



**మొయినాబాద్, (జనంసాక్షి):** మత సామరస్యానికి ఇఫ్తార్ విందు ప్రతీక అని నక్కలపల్లి గ్రామ మాజీ సర్పంచ్ స్వప్న అంజయ్య గౌడ్ పేర్కొన్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షల్లో ఉండే ముస్లిం సోదరుల కోసం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. వారితోపాటు ఇఫ్తార్ విందులో పాల్గొని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షల్లో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులో ఆత్మీయత, మత సంరస్యానికి ప్రతీకని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

### కొందుర్గు ఎస్ఐ రవీందర్ నాయక్

**కొందుర్గు, (జనంసాక్షి):** రానున్న ఉగాది, శ్రీరామ నవమి మరియు రంజాన్ పండుగల నేపథ్యంలో కొందుర్గు పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొందుర్గు సబ్ ఇన్స్పెక్టర్ రవీందర్ నాయక్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన హిందూ, ముస్లిం మత పెద్దలతో, యువకులతో మాట్లాడారు. అనంతరం ఎస్ఐ మాట్లా డుతూ, ప్రజలందరూ కులమతాలకు అతీతంగా, సోదరభావంతో పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని, సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పండుగ వేడుకల సమయంలో ఏదైనా సమస్యలు తలెత్తితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ రవీందర్ నాయక్ తెలిపారు. ఈ సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**వెల్జాల్‌లో విజయవంతమైన ఆరోగ్యం శిబిరం**



**తలకొండపల్లి (జనంసాక్షి):** వైద్య శిబిరాలతో గ్రామీణ ప్రాంత పేదలకు ఉచిత వైద్య సదుపాయాన్ని కల్పించడం తన కర్తవ్యం అని వెల్జాల్ సర్పంచ్ వానరాశి రాములమ్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో కామినేని హాస్పిటల్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య ఆరోగ్య శిబిరన్ని కామినేని హాస్పిటల్ డాక్టర్లు చందన,లింగా స్వామి ,మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సందీప్,తో కలిసి స్థానిక సర్పంచ్ వానరాశి రాములమ్మ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి,మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు.ఉచిత ఆరోగ్య శిబిరంలో దాదాపు130 మందికి కంటి పరీక్షలు,కీళ్ల నొప్పులు,జలుబు,జ్వరం,దగ్గు లాంటి పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ చిన్న చిన్న జాగ్రత్తలు పాటించి ప్రతిరోజు ఉదయం వ్యాయామం చేస్తూ సరైన ఆహారం తీసుకొని ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సూచించారు.అనంతరం సర్పంచ్ రాములమ్మ మాట్లాడుతూ..డాక్టర్లు దైవంతో సమానం అని,మారుమూల ప్రాంతాలలో ఇలాంటి మంచి కార్యక్రమాలు ప్రజలకు అందించడం గొప్ప విషయం అన్నారు.వైద్య సేవలను ఉచిత అందించిన డాక్టర్ల బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ విజయలక్ష్మి విజయ్ కుమార్,మాజీ జెడ్పి కోఆప్షన్ ముజీబుర్ రహమాన్,మాజీ ఎంపీటీసీలు జి.శ్రీనివాసమూర్తి, అంబాజీ,మాజీ ఉప సర్పంచులు నర్సింహులు, అజీజ్,వార్డు సభ్యులు శేఖర్,మండల కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షులు ఎండి ఆరిఫ్,నాయకులు అశోక్ బాబు,వానరాశి వెంకటేష్,వెంకట్ రెడ్డి, బాలకిష్టయ్య,వద్దే రాజు,లింగం యాదవ్, విష్ణు, దశరథం,రాఘవేందర్ గౌడ్,పాల్గొన్నారు.

## పీర్జాదిగూడలో చలివేంద్రం ప్రారంభం

**బాటసారుల దాహార్తికి చల్లని ఉపశమనం**




**బోడుప్పల్ (జనంసాక్షి):** వేసవి వేడి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పీర్జాదిగూడలో ఏర్పాటు చేసిన చలివేంద్రం బుధవారం ఘనంగా ప్రారంభమైంది.మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ 10వ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో కొల్తూరు సాయి కుమార్ తన తల్లిదండ్రులు అనసూయ,యాదయ్యల జ్ఞాపకార్థం ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,ఆర్.వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, చేరుకు మహేష్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ పెరుగుతున్న ఎండల నేపథ్యంలో ప్రజలకు చల్లని నీరు అందించాలనే ఉద్దేశంతో సాయి కుమార్ చేపట్టిన ఈ సేవా కార్యక్రమం అభినందనీయమని అన్నారు.సమాజంలో ఇతరులకు సహాయం చేయాలనే భావన గొప్పదని వేసవిలో దాహంతో అలమటించే వారికి మంచినీరు అందించడం అత్యుత్తమ సేవ అని పేర్కొన్నారు. సాయి కుమార్ లాంటి యువకులు ముందుకు వచ్చి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సమాజానికి ఆదర్శమని ఈ చలివేంద్రం ద్వారా వేసవి కాలం మొత్తం శుభ్రమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉమేష్ రెడ్డి,రాజు గౌడ్,సాయి రెడ్డి,సందీప్,చింటు, బంటీ,జంగయ్య,ఇర్ఫాన్,నవీన్, మహేందర్,సందీప్ రెడ్డి,అస్లాం తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బంటు జ్ఞానేశ్వర్



**మొయినాబాద్, (జనంసాక్షి):** బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మొయినాబాద్ మండలా నికి చెందిన నాగిరెడ్డిగూడ గ్రామస్తుడు బంటు జ్ఞానేశ్వరను నియమించారు. ఈ మేరకు నగరంలో పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రాజభూపాల్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బంటు జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తానన్నారు. గ్రామస్థాయి నుంచి వార్డుల వారిగా ఎదుగుతూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులు కావడం సంతోషంగా ఉందన్నారు. బీజేపీ పార్టీ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై మరింత భారం పెరిగిందని పార్టీ కోసం మండల, జిల్లాస్థాయిలో పార్టీని అభివృద్ధి చేసేందుకు తనవంతు సాయశక్తుల కృషి చేస్తానన్నారు. మారుమూల గ్రామం నాగిరెడ్డిగూడ నుంచి తనను గుర్తించి జిల్లాస్థాయి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## నక్కలపల్లి గ్రామ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడిగా సంగి పవన్ కుమార్



**మొయినాబాద్, (జనంసాక్షి):** మొయినాబాద్ మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో అంబేద్కర్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికయ్యారు. బుధవారం అంబేద్కర్ సంఘం అధ్యక్షుడిగా సంగి పవన్ కుమార్, ఉపాధ్యక్షులు మంగళరం విక్రం, ప్రధాన కార్యదర్శి మంగళరం శ్రీకాంత్, కార్యదర్శి మంగళరం చెన్నయ్య, సహాయ కార్యదర్శి సుక్కి రక్షిత్ కుమార్, కోశాధికారి పట్నం సాయి లను అంబేద్కర్ సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారిని గ్రామ సర్పంచ్ యాదయ్య ఉపసర్పంచ్ నిరంజన్ గౌడ్‌లు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆశయాలతో ఏర్పడిన ఈ సంఘం గ్రామంలోని ఎస్సీ యువతకు ప్రజలకు దారి దీపంగా నిలవాలన్నారు. నూతన కమిటీ సభ్యులు బాధ్యతతో అంకిత భావంతో పనిచేసి సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని వారు సూచించారు. సామాజిక న్యాయం, సమానత్వం అభివృద్ధి లక్ష్యాలతో, ముందుకు సాగాలని వారు తెలిపారు. గ్రామ అభివృద్ధిలో ఈ సంఘం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు రవీందర్, నాయకులు గౌరీ రవి, రాజు గౌడ్, భాను కుమార్, నవీన్, బుచ్చయ్య, యాదయ్య, మహేందర్, జంగయ్య, సంఘం యువకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఈదురు గాలుల బీభత్సం మొక్కజొన్న పంటలు పూర్తిగా నేలమట్టం



**పెద్దేముల్ (జనంసాక్షి):** పెద్దేముల్ మండలం ఖానాపూర్ గ్రామంలో నిన్న రాత్రి వీచిన ఈదురుగాలుల ప్రభావంతో గ్రామానికి చెందిన మల్లెపు,అంజిరెడ్డి అనే రైతు తన 11 ఎకరాలలో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. మంగళవారం రాత్రి బలమైన గాలులు వీచడంతో తన 11 ఎకరాల మొక్కజొన్న పంట పూర్తిగా నేలమట్టం అయింది. అలాగే మండలంలోని అనేక గ్రామాల్లో మొక్కజొన్న పంట పూర్తిగా నేలమట్టమయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి పంటలు సాగు చేసిన రైతులకు ఈదురుగాలులు భారీ నష్టాన్నే మిగిల్చాయని రైతులు బోరున విలపిస్తున్నారు. దెబ్బతిన్న పంటలను అధికారులు వెంటనే పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపాలని, అలాగే నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు వేడుకున్నారు.

## మాదాపూర్ సర్కిల్ కార్యాలయం న్యాక్ భవనంలోకి తరలింపు



**శేరిలింగంపల్లి, మార్చి 18 (జనంసాక్షి) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మాదాపూర్ వార్డు కార్యాలయంలో ఇప్పటివరకు కొనసాగిన మాదాపూర్ సర్కిల్ కార్యాలయాన్ని బుధవారం డివిజన్ పరిధి హైటెక్స్ సమీపంలోని న్యాక్(ఎన్‌ఏసి) భవనంలోకి మార్చినట్లు సర్కిల్ ఉప కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలు ఆయన వివరిస్తూ పరిపాలనా సౌలభ్యం, ప్రజలకు మెరుగైన సేవలందించే ఉద్దేశంతోనే ఈ కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చినట్లు ఆయన వివరించారు. పౌర సేవా కేంద్రంతోపాటు టౌన్ ప్లానింగ్, పారిశుధ్యం, పన్నుల విభాగాలన్నీ ఇకపై నూతన భవనం నుండే తమ విధులను నిర్వర్తిస్తాయని, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం లేదా ఇతర అవసరాలు, ధ్రువీకరణ పత్రాల నిమిత్తం ఇకపై పాత వార్డు కార్యాలయానికి వెళ్లకుండా హైటెక్స్ వద్ద ఉన్న ఎన్‌ఏసి భవనంలోని సర్కిల్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. నూతన కార్యాలయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతుల కల్పన చేయడం జరిగిందని, ప్రజలందరూ ఈ మార్పును గమనించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## గ్రామస్తుల సమిష్టి కృషి వల్లనే చీమలదరి గ్రామానికి జాతీయస్థాయిలో గుర్తింపు

**చీమలదరి గ్రామ సర్పంచ్ ఎల్లకొండ కల్పన హరీష్ కుమార్ రెడ్డి.**



**మోమీన్ పేట మార్చి 18 (జనంసాక్షి):** మోమిన్ పేట మండల పరిధిలోని చీమలదరి గ్రామస్తుల సమిష్టి కృషి, సహకారం వల్లనే నేడు మన గ్రామానికి జాతీయస్థాయిలో అవార్డు సాధించడం గర్వకారణమని గ్రామ సర్పంచ్ ఎల్లకొండ కల్పన హరీష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలంలోని సంగాయిపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ హనుమయ్య తోపాటు, ఉప సర్పంచ్ వార్డు సభ్యులతో పాటు చీమలదరి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అధ్యక్షతన గ్రామానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలను, ప్రణాళికల బద్ధంగా వారికి వివరించడం జరిగింది. అనంతరం వారిని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా , పర్యటించి, పల్లె ప్రకృతి వనం, గ్రామపంచాయతీ కార్యాలయం, అంగన్వాడి కేంద్రం, పచ్చదనం పరిశుభ్రత, స్మశానవాటికలతో, గ్రామంలో జరిగిన అన్ని అభివృద్ధి కార్యక్రమాలను ఇంటర్నెట్ సౌకర్యం వంటి వాటిని పరిశీలించారు. ఈ గ్రామానికి జాతీయ స్థాయిలోనే గుర్తింపు రావడం అభినందించదగ్గ విషయమన్నారు. జాతీయస్థాయిలో ఉత్తమ అవార్డు లభించిన, కల్పన హరీష్ కుమార్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం హర్షించదగ్గ విషయమని వారుకొని యాడారు. చీమలదరి గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని సంగయిపల్లి గ్రామంలో అభివృద్ధి చేసి చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భరత్ కుమార్, పాల్గొన్నారు.

## చెరువుల శుభ్రతకు శ్రీకారం

**గుర్రపు డెక్క తొలగింపు ప్రారంభం**



**బోడుప్పల్ (జనంసాక్షి):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలో చెరువులు,నీటి మడుగుల్లో పెరిగిన గుఱ్ఱపు డెక్క తొలగింపు కార్యక్రమాన్ని బుధవారం డిప్యూటీ కమిషనర్ ఎ.శైలజ పీర్జాదిగూడ చెరువులో ప్రారంభించారు.ఈ సందర్భంగా యంత్రాల సహాయంతో చెరువుల్లో పెరిగిన మొక్కలను తొలగిస్తారు.అనంతరం దోమల లార్వా నిర్మూలన కోసం గంబూసియా చేపలను నీటిలో వదిలారు.ఈ చర్యల ద్వారా నీటి వనరుల శుభ్రతను మెరుగుపరచడం దోమల పెరుగుదలను నియంత్రించడం ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం లక్ష్యంగా చేపట్టిన కార్యక్రమమని డిప్యూటీ కమిషనర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎస్‌డబ్ల్యూఎం) కె. జహ్నవి శశాంక్ పాల్గొన్నారు.